రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణారెడ్డి

లింగోజిగూడ: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధి కృషి చేయాలని హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. సంఘం పరిధిలోని రైతులు రుణమాఫీ అయిన వారు తిరిగి రుణాలు తీసుకోవాలని కోరారు. అనంతరం బండరావిర్యాల, చిన్న బండరావిర్యాల, గువ్వలేటి గ్రామ రైతులకు క్రాప్‌లోన్ చెక్కులను అందజేశారు. సంఘం ముఖ్య కార్య నిర్వహణ అధికారి జమా ఖర్చులను వివరించగా సభ్యులు ఆమోదించారు. బండరావిర్యాలలో సంఘం నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామ మాజీ సర్పంచి సంఘం సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు విజయలక్ష్మీ, ముత్యం రాజశేఖర్, అంజయ్య, నర్సింహ్మా రెడ్డి, యాదమ్మ, నర్సింహా, నరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, ధర్మరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో కాంగ్రెస్ మోసం


రైతు దీక్షకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో రైతన్నలను మోసం చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి ఆరోపించారు. కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మలక్‌పేట నుంచి పార్టీ నాయకులు సోమవారం నగరంలో బీజేపీ ప్రజాప్రతినిధులు 24 గంటలు చేపట్టిన 'రైతు హామీల సాధన దీక్ష'కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక పాలకులను ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల పక్షాన నిలబడి సమస్య పరిష్కారానికి కిసాన్ మోర్చా కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు, చేతలకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. దీక్షకు తరలిన వెళ్లిన వారిలో సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవేందర్, సురేందర్, శ్రీనివాస్, శివ, దినేష్ ఉన్నారు.

సర్వీస్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే డ్రైవర్‌కు గాయాలు

- బస్ డ్రైవర్, యజమానికి కలిపి రూ.3,96,400 నష్ట పరిహారం ఇవ్వండి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్

సిటీ కోర్టులు : ఆటో మోటీవ్ మ్యానుఫ్యాక్చరర్స్ ప్రై.లి. సర్వీస్ సెంటర్ సిబ్బంది కారణంగా బస్ డ్రైవర్‌కు గాయాలయ్యాయని బస్సుకు మరమ్మతులు చేస్తున్న సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతోనే ఆర్థిక నష్టం జరిగిందని, ఇందుకు కారణం సర్వీస్ సెంటర్ సిబ్బందేనని రాష్ట్ర వినియోదారుల కమిషన్ తమ విచారణలో తేల్చింది. బస్సు యజమానితో పాటు డ్రైవర్‌కు కలిపి రూ.3,86,400ను నష్టపరిహారం, మరో రూ.10 వేలు కోర్టు ఖర్చులకు చెల్లించాలని సర్వీస్ సెంటర్ యాజమన్యాన్ని కమిషన్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోపు చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌చార్జి చైర్మన్ మీనా రామనాథన్, మెంబర్ వి.వి. శేషుబాబుతో కూడిన బెంచ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు ఇలా..

సరూర్‌నగర్‌కు చెందిన కె.తిరుపతి 2015లో సుందరం ఫైనాన్స్ నుంచి రూ. 18 లక్షలు తీసుకుని అశోక్ లేలాండ్ డీలర్ నుంచి బస్సు కొనుగోలు చేసి డ్రైవర్‌గా ఉప్పల్‌కు చెందిన పద్మయ్యను పెట్టుకున్నాడు. ఈ బస్సును టీఎస్‌ఆర్టీసీతో ఒప్పందం కుదుర్చుకొని వేములవాడ నుంచి జూబ్లీస్టేషన్‌కు నడుపుతున్నారు. బస్ మొదటి సర్వీస్‌లో భాగంగా నవంబర్ 2015లో జీడిమెట్లలోని నాగసాయి కోచ్ బిల్డర్స్ దగ్గరికి తీసుకెళ్లారు. సర్వీసింగ్‌లో భాగంగా యాంటిరస్ట్ స్ప్రేను ఉపయోగించి గాలి లీకేజీని చూడటానికి బ్రేక్ సిస్టంను తనిఖీ చేశారు. ఆ సమయంలో డ్రైవర్ పద్మయ్య వ్యూ మిర్రర్‌ను పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో సరీస్ సెంటర్ సిబ్బంది టైర్ తీయడంకోసం జాకీని కఠినంగా ఉపయోగించడంతో బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై యాంటిరస్ట్ స్ప్రే కిందపడి లీక్ కావడంతో బస్సు బ్యాటరీకి అంటుకొని మంటలు చెలరేగడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ బాలాజీ దవాఖానాలో చికిత్స నిమిత్తం చేర్పించారు. తమకు జరిగిన అన్యాయానికి నష్టపరిహారం ఇప్పించాలని బస్సు యజమాని, డ్రైవర్ వినియోగదారుల కమిషన్-1ను సంప్రదించి కేసు (సీసీ నెం.349ఆఫ్2016) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్ పిటిషనర్లకు పరిహారం చెల్లించాలని సర్వీస్ సెంటర్‌ను ఆదేశించింది. దీంతో ప్రతివాది అయిన సర్వీస్ సెంటర్ యజమాని రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన స్టేట్ కమిషన్ బస్ డ్రైవర్‌తో బస్సు యజమాని కూడా ఆర్థికంగా నష్టపోయారని ఇద్దరికి నష్ట పరిహారం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

స్వచ్ఛ రిక్షాల అందజేత

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్త కుప్పలను ఎప్పటికప్పుడే తరలించాలని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్‌లోని వార్డు కార్యాలయం వద్ద కార్మికులకు చెత్త సేకరించే రిక్షాలను డీసీ, కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటైజేషన్ డీఈ చందన, బుచ్చయ్య, నాయకులు నీరంకి రవి, తోట మహేందర్ యాదవ్, కాట విజయ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రిక్షాలను అందజేస్తున్న
డీసీ సుజాత, కార్పొరేటర్

3 నుంచి దేవీ శరన్నవరాత్రులు


కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవీ దసరా శరన్నవరాత్రులు 3వ తేదీ నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆలయంలో నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం 6.30 విశేష అభిషేకం, కుంకుమార్చన, అమ్మవారి ప్రత్యేక అలంకరణ దర్శనం, విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి 8 గంటలకు మహా నక్షత్ర హారతులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, అరుణ, హేమంత్ శర్మ, రామశర్మ, అశ్వంత్, సంతోషి, హేమ,పద్మలక్ష్మి, పూర్ణిమ పాల్గొన్నారు

అనుమతులు లేకుండా పోస్టర్లు ముద్రించరాదు


ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న
డీసీ జయంత్

చాదర్‌ఘాట్: జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా ఎలాంటి గోడపత్రికలు, సినిమా పోస్టర్లు, ఫ్లెక్సీలు, పాంప్లేట్లు ముద్రించరాదని డీసీ జయంత్ హెచ్చరించారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయంలో సోమవారం ఆయన సర్కిల్ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.10 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

వామ్మో.. పాములు



మూసారంబాగ్ డివిజన్ సంజీవయ్య నగర్ వాసులను పాముల భయం వెంటాడుతోంది. కాలనీ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో విష సర్పాలు తిరుగుతున్నాయని స్థానికులు బెంబేలెత్తుతున్నారు. సమీపంలోనే బాగ్‌మూసారిమో ప్రభుత్వ పాఠశాల ఉందని విద్యార్థులు ప్రతీ రోజు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ విషయం పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరానికి చర్యలు చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి ముప్పిడి బల్వంత్ కోరారు. -మలక్‌పేట

పడకేసిన పారిశుద్ధ్యం

- పేరుకుపోతున్న వ్యర్థాలు
- దుర్గంధంగా కాలనీలు
- తరలించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



హస్తినాపురం: అధికారుల నిర్వహణ లేక, సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్త పేరుకుపోయి పారిశుధ్యం వ్యవస్థ పడకేస్తోంది. హస్తినాపురం డివిజన్ పరిధి హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఎటు చూసినా చెత్త కుప్పలు, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలే దర్శనమిస్తున్నాయి. చెత్త తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీల్లోని రోడ్ల పక్కన, పార్కు స్థలంలో చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు పెరుగుతున్నా వాటిని తొలగించాల్సిన సిబ్బంది అటువైపు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాలనీల్లో దుర్వాసన

సంతోషిమాతా దేవాలయం వెనకాల ఉన్న పార్కులో పిచ్చి మొక్కలు పెరగడంతో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు వేయడంతో దోమలు వృద్ధి చెందిన వివిధ రకాల వ్యాధులు వస్తున్నాయి. పేరుకుపోతున్న వ్యర్థాలతో కాలనీలో దుర్వాసనతో పాటు విష సర్పాలు క్రిమికీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీల్లో దుర్గంధంతో మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులు స్పందించి ఆయా కాలనీల్లో పర్యటించి చెత్త కుప్పలను తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలు, బస్తీవాసులు కోరుతున్నారు.


పార్కుస్థలంలో చెత్తకుప్పలు, పిచ్చి మొక్కలు

అధికారులు స్పందించాలి..



తమ కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు స్పందించాలి. కాలనీలో ఉన్న పార్కులో చెత్తా చెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదు. గత కొంత కాలంగా కాలనీలోని బహిరంగ ప్రదేశాలలో చెత్తా చెదారం పేరుకుపోయి దోమ కాట్లతో పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

-శ్రీనివాస్‌రెడ్డి, నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి..



కాలనీలోని బహిరంగ ప్రదేశాలలో పార్కు స్థలంలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో తమ ఇళ్లలోకిపాములు, తేళ్లు వస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఓ వైపు జీహెచ్‌ఎంసీ అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పేరుతో బ్యానర్లు కట్టి ర్యాలీలు చేస్తున్నారే తప్ప చిత్తశుద్ధితో సమస్యలను పట్టించుకోవడం లేదు.పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలి.

-చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి

కాలనీ నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీనివాస కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షుడిగా శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడిగా భీమ్‌రాజ్, సెక్రెటరీగా సుబ్బయ్య, కోశాధికారిగా సంపత్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతూ.. కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

మలక్‌పేట: ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా విద్యార్థులు కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ మహిళా డిగ్రీ కాలేజ్ చైర్మన్ నాగం మోహన్‌రెడ్డి అన్నారు. కాలేజీలో జరిగిన ఫ్రెషర్స్‌డేలో అయన పాల్గొని మాట్లాడారు. కలిసివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగం మాలతీరెడ్డి, సెక్రటరీ నన్నూరు సీతారాంరెడ్డి, ట్రెజరరీ మంజురెడ్డి, ప్రిన్సిపాల్ వెదిరె వీణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటయ్య

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..హస్తినాపురం సెంట్రల్‌లో నివాసముండే ఉడుతుల వెంకటయ్య (52) గత కొన్ని రోజుల నుంచి తమ్ముడు సత్య నారాయణ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 25న తేదీన వెంకటయ్య కాలనీలోని గుడికి వెళ్తానని చెప్పి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గర్భిణిపై దాడి చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: గర్భిణీపై కర్రతో దాడి చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 18 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ శోభారాణి వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఠాణా పరిధి అత్తాపూర్ ప్రాంతంలో జగదీశ్‌కౌర్ కుటుంబంతో కలిసి నివాసముండేది. ఇంటి డాబాపై బాధితురాలి కుమారుడు ఆడుకుంటుండగా పైనుంచి ఓ రాయి కింద ఉన్న ఆటోపై పడింది. ఆటోలో మద్యం తాగుతూ కూర్చున్న శైలేందర్ సింగ్(39) కోపంతో బాలుడిపై దాడి చేస్తుండగా ఆపేందుకు యత్నిస్తున్న బాధితురాలు 8 నెలల గర్భిణి అని చూడకుండా కర్రతో మెడ, నడుముపై తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా 4వ అదనపు సీనియర్ న్యాయమూర్తి ఎ. నాగరాజు నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చైతన్యపురిలో చైన్ స్నాచింగ్

చైతన్యపురి: నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశర్లు వివరాల ప్రకారం.. అల్కాపరి రోడ్ నంబర్-8లో నివసించే లక్ష్మి సుజాత సోమవారం సాయంత్రం ఇంటి సమీపంలోని కిరాణా దుకాణానికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న నాయకులు

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డా. పిడమర్తి రవి డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగల మేలుకొలుపు యాత్ర సోమవారం ఎల్‌బీనగర్‌కు చేరుకుంది. ఈ యాత్రకు ఎమ్మార్పీఎస్ నేత, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జోగు రాములు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని మాదిగల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు మేలుకొలుపు యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19న యాత్రను ప్రారంభించామని, నేడు ముగింపు కార్యక్రమం భువనగిరిలో జరుగుతుందన్నారు.

ప్రతి కాలనీలో పరిశుభ్రత పాటించాలి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో పరిశుభ్రత పాటించాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ డీఈ నగేశ్‌నాయక్ ఆధ్వర్యంలో వివిధ కాలనీలో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో తడి,పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా భావించాలన్నారు. కార్పొరేటర్ వెంట శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు


చెత్త వేయొద్దని ర్యాలీ నిర్వహిస్తున్న
సూరజ్ దోమజీ పట్‌భజే, కార్పొరేటర్లు, డీసీ

మన్సూరాబాద్: ఇళ్లలో పోగయ్యే వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) అడిషినల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) సూరజ్ దోమజీ పట్‌భజే అన్నారు. సోమవారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ఆయన హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరజ్ దోమజీ పట్‌భజే మాట్లాడుతూ.. మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు మన్సూరాబాద్ గేటు వద్ద జీఎస్‌ఐ సౌజన్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గేటు ప్రధాన రోడ్డు వద్ద చెత్త వేస్తే వాకర్స్‌కు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌ఐ డీడీజీలు ఎల్‌పీ సింగ్, ఎస్ఎన్ పాత్ర, హర్మోహన్ మిషరా, జాయింట్ డైరెక్టర్ తారకేశ్వర్‌రావు, ఆదర్ల మహేష్, మధిర సత్యనారాయణ, దివాకర్‌రెడ్డి, నరేందర్, సచిన్, చంద్రయ్య, నీలిమ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సాయి ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

- హయత్‌నగర్‌లోని క్రీడా ప్రాంగణంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీపీ)లో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి చెత్తను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ హిట్టినహళ్లి, డా. విజయ్‌కుమార్, డా. సుధీర్, జీవీ చౌహాన్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం


దరఖాస్తు పత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో సోమవారం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన హాజరై జర్నలిస్ట్ ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పదేళ్లుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం స్థలాల కోసం చేపడుతున్న విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా జాబితా తయారు చేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శశిపాల్ రెడ్డి, శ్రీనివాస్, రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ్, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ శంకర్‌నగర్‌లో మూడవరోజు మూసీ నిర్వాసితులకు షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 45 మందికి పట్టాలు పంపిణీ చేశామని బుధవారం నుంచి కూల్చివేతలు ప్రారంభిస్తామన్నారు. నిర్వాసితులు అందరికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు.

మెట్రోను త్వరగా విస్తరించాలి


మాట్లాడుతున్న మామిడి రాంచందర్

మన్సూరాబాద్: నాగోలు నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రోను త్వరగా విస్తరించాలని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి రాంచందర్ డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని వైఎస్సార్ ఆక్సిజన్ పార్కు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగోలు నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో లింక్ లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎల్‌బీనగర్-హయత్‌నగర్, ఎల్‌బీనగర్- ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణ చేపడితే ట్రాఫిక్ చిక్కులు తగ్గుతాయన్నారు. ఈ సమావేశంలో రవినాయక్, కృష్ణ నాయక్, శ్రీకాంత్‌యాదవ్, ప్రవీణ్, సాంబయ్య, కుమార్, వెంకటేష్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ టీవీ కాలనీకి చెందిన ఎం.శ్రీనివాసులుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును సోమవారం మధుయాష్కీ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కుట్ల నరసింహాయాదవ్, స్వర్ణమాధవి, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులు

వనస్థలిపురం: హయత్‌నగర్ మండల ప్రైవేట్ పాఠశాలల (ట్రస్మ)కు జరిగిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా రాధాకృష్ణ (శాంతినికేతన్‌పాఠశాల), అధ్యక్షుడిగా జి.సురేందర్‌రెడ్డి (హయత్‌నగర్ పబ్లిక్ స్కూల్), ప్రధాన కార్యదర్శిగా ఎల్.ప్రశాంత్‌కుమార్ (శివ సింధు హైస్కూల్), కోశాధికారిగా రామారావు (విజేత మోడల్ స్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి టెన్యూర్ పీపీల నియామకాన్ని పునరుద్ధరించాలని న్యాయవాదుల సంఘాల నాయకులు జిల్లా కోర్టు ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం దిగి వచ్చే వరకు దీక్షలు విరమించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎలన్నగారి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ, అందేకర్ అశోక్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


సెల్‌ఫోన్లు అందుకున్న వారితో ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 90 సెల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన, సెల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అందజేశామన్నారు. కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ముంబై ఇతర ప్రాంతాలను నుంచి రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, డీఎస్‌ఐ నరేందర్, క్రైమ్ సిబ్బంది భిక్షపతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


స్థానికులతో మాట్లాడుతున్న డీసీ యాదయ్య

నాగోలు: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ మమతనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు వారు పర్యటించారు. కాలనీలోని వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ అరుణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ లక్ష్మయ్య, కాలనీ వాసులు ప్రభావతి, శ్రీధర్, ఎస్‌ఎఫ్‌ఏలు వెంకటస్వామి, ఆనంద్, రవి, రాంకీ సూపర్‌వైజర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మన్సూరాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్‌లోని హిమపురికాలనీ ఫేజ్-1లో చేపడుతున్న ట్రంక్ లైన్ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న బాక్స్‌టైప్ నాలా పనులకు నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఎక్కడ నీరు నిల్వకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, కాలనీవాసులు గఫార్, సయ్యద్‌జానీ ఉన్నారు.